
సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం | 17 | ఏప్రిల్ | 2024



మూడుచోట్ల చూడముచ్చట!
జి.మామిడాడలో కోదండరామునికి, ర్యాలిలో జగన్మోహినీ కేశవస్వామి వార్ల కల్యాణోత్సవాలు బుధవారం జరగనున్నాయి.

8లో



డెల్టాలకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.

గరిష్టం/కనిష్టం
42.5° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.5	25.0
కాకినాడ	38.1	25.6
అమలాపురం	39.0	25.0

న్యూస్‌రీల్

73 మందికి షోకాజ్ నోటీసులు



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం నిర్వహించిన తొలి విడత శిక్షణ తరగతులకు 73 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి కారణాలు తెలియజేయాలని ఆదేశిస్తూ వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారందరూ ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వ్యక్తిగతంగా హాజరై శిక్షణకు గైర్హాజరవడానికి గల కారణాలపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కారణం సహేతుకంగా లేకపోయినా, అవాస్తవమైనా తక్షణమే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రశాంతంగా శ్లాస్ పరీక్ష

కంబాలచెరువు: స్టేట్ లెవెల్ అచీవ్ మెంట్ సర్వే (శ్లాస్) పరీక్ష జిల్లాలో మంగళవారం ప్రశాంతంగా జరిగిందని పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 121 పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించామన్నారు. దీనికి 3,832 మంది హాజరుకావాల్సి ఉండగా, 3,682 మంది పరీక్ష రాశారన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయి మదింపునకు ఈ పరీక్షను ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించామన్నారు. దీనికోసం ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.

మళ్లీ వచ్చేది సంక్షేమ ప్రభుత్వమే

వైఎస్సార్ సీపీ నేత శెట్టిబత్తుల రాజబాబు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత రాజబాబు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది సంక్షేమ ప్రభుత్వమే. మాట తప్పని జననేత ముఖ్యమంత్రి జగన్ వైపే ప్రజలు ఉన్నారని ఇటీవల జనసేన పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరిన శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. అమలాపురం నల్ల వంతెన సమీపంలో గల ఎన్‌వీఆర్ నగర్‌లోని తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజబాబు మాట్లాడారు. ప్రజల అవసరాలను గుర్తెరిగి సంక్షేమాన్ని అందించే, మాట ఇచ్చారంటే మడం తిప్పని జగన్ నైజానికి ఆకర్షితుడినై తాను వైఎస్సార్ సీపీలో చేరానని చెప్పారు. విజయవాడ సిద్ధం సభ బస్సు యాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్‌పై జరిగిన దాడి అమానుషమని పేర్కొన్నారు. దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ ఈ ఎన్నికల్లో మరోసారి గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్న అక్కసు, కుట్రతో ఈ దాడి చేశారని అన్నారు. జిల్లాలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుతోపాటు ఏడు అసెంబ్లీ నియోకవర్గాల పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు సందాడి శ్రీనుబాబు, ముత్తాబత్తుల శ్రీను, చవల వెంకటేశ్వరరావు, పోతుమూడి రవికుమార్, దాసరి శ్రీను, జనుపెల్ల శివాజీ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా.. పకడ్బందీగా..

- సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధం
- ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా ఏర్పాట్లు
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 25వ తేదీ వరకూ గడువు
- జిల్లా వ్యాప్తంగా 1,577 పోలింగ్ కేంద్రాలు
- సమస్యాత్మక కేంద్రాలపై గట్టి నిఘా
- కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీప్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎస్పీ జగదీష్, జేసీ తేజ్‌భరత్



పొట్టిలంక చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక సమరానికి సమయం ఆసన్నమవుతోంది. ఎన్నికల ప్రక్రియలో తొలి అంకమైన నామినేషన్ల స్వీకరణ ఘట్టం సమీపిస్తోంది. ఈ తరుణంలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై అధికార యంత్రాంగం మరింతగా దృష్టి సారించింది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేసింది. ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేస్తోంది. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,577 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 367 సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వెబ్ కాస్టింగ్, పటిష్ట నిఘా, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణపై అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఇలా పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉన్నారు. ఈ వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ కె.జగదీష్ కలెక్టరేట్‌లో కార్యాలయంలో మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పార్లమెంటరీ సహాయ ఆర్‌ఓ ఎం.కృష్ణా నాయక్ పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్పీ తెలిపిన వివరాలివీ..

9,644 మంది పోలింగ్ సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియలో 9,644 మంది భాగస్వాములు కానున్నారు. వీరిలో 422 మంది మైక్రో అబ్జర్వర్లు, 16 మంది నోడల్ అధికారులు, 3 విడతల్లో 63 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికలను పర్యవేక్షిస్తాయి. 24 వీడియో సర్వైలెన్స్ బృందాలు, 23 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, 63 స్టాస్టిక్ సర్వైలెన్స్ బృందాలు, 26 వీడియో వ్యూయింగ్, 16 అకౌంటింగ్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీతో పాటు 24 గంటలూ సమీకృత కమాండ్ కంట్రోల్ రూము ద్వారా పర్యవేక్షణ చేస్తున్నారు.

ఉల్లంఘనలపై ఉక్కుపాదం

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అధికారులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలో 41 కేసులు నమోదు కాగా 39 పరిష్కరించారు. రెండు పరిశీలనలో ఉన్నాయి. 46 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సేవా పోర్టల్ ద్వారా మరో 312 ఫిర్యాదులు అందాయి. ఇప్పటి వరకూ 1,796 మంది గ్రామ/వార్డు వలంటీర్లు రాజీనామా చేశారు. సువిధ/ఎన్‌కోర్ ద్వారా 597 దరఖాస్తులు రాగా, 505కు అనుమతి ఇచ్చారు. 63 తిరస్కరించారు. మిగిలిన 29 పురోగతిలో ఉన్నాయి.

పోలీసు నిఘా కట్టుదిట్టం

సార్వత్రిక ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటి నుంచీ జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యాన పోలీసులు గట్టి నిఘా, బందోబస్తు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 16 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నియమావళిని ఉల్లంఘించి తరలిస్తున్న నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. డిసెంబర్ 25 నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో రూ.5.41 కోట్ల సొత్తు పట్టుబడింది. దీనిలో రూ.1.22 కోట్ల నగదు, రూ.2.75 కోట్ల విలువైన మద్యం, రూ.29 లక్షల మాదక ద్రవ్యాలు, రూ.1.10 లక్షల ఇతర సామగ్రి ఉన్నాయి.

నేరస్తులపై నిఘా

వివిధ కేసుల్లో కేసులలో ఉన్న 6,006 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో 236 లైసెన్స్‌డ్ తుపాకులు ఉండగా.. పోలీసుల వద్ద 177 తిరిగి డిపాజిట్ చేశారు. బ్యాంకుల వద్ద వున్న 58 ఆయుధాలకు అనుమతులు ఇచ్చారు.

ఓటర్లలో చైతన్యం కోసం..

జిల్లాలో ఏప్రిల్ 10వ తేదీ నాటికి 16,16,918 మంది ఓటర్లు ఉన్నారు. ఓటు హక్కు వినియోగం, నూతన ఓటర్ల నమోదుపై చైతన్యం తీసుకుని వచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా 2,120 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వీటిల్లో 6.60 లక్షల మంది ఓటర్లను భాగస్వాముల్ని చేశారు. జిల్లాలో అత్యవసర సేవలు అందించే వివిధ విభాగాల్లోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో మీడియా సెల్‌ను కలెక్టర్, ఎస్పీ ప్రారంభించారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. అప్పటి నుంచీ అధికార యంత్రాంగం ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేస్తోంది. జిల్లాలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ జరగనుంది. దీనికి అనుగుణంగా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. ఈ నెల 25వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 21వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు నామినేషన్ల స్వీకరణ ఉండదు. నామినేషన్ల దాఖలు సమయంలో సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కార్యాలయం వద్ద 100 మీటర్ల వరకూ 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ వేసే వ్యక్తితో పాటు మరో నలుగురికి మాత్రమే ఆర్‌ఓ చాంబర్‌లోకి అనుమతి ఉంటుంది.

సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా

2014, 2019 ఎన్నికల్లో గొడవలు జరిగిన 230 గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటిలో మార్చి 1 నుంచి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. నాలుగు సీఎస్ఎఫ్ కంపెనీ బలగాలు ఈ విధులు నిర్వహిస్తున్నాయి. మరో నాలుగు బృందాలు రానున్నాయి. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా ధైర్యంగా ఓటు వేసేలా ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

నామినేషన్లు స్వీకరించేదిక్కడ

ఆయా నియోజకవర్గాల్లోని ఆర్‌ఓల వద్ద నామినేషన్లు స్వీకరిస్తారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఆర్‌ఓగా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఎంపీ అభ్యర్థులు ఆమె చాంబర్‌లో నామినేషన్లు దాఖలు చేయాలి. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్‌కు జాయింట్ కలెక్టర్, రాజమహేంద్రవరం సిటీకి నగరపాలక సంస్థ కమిషనర్, కొవ్వూరుకు అక్కడి సబ్ కలెక్టర్, రాజానగరం, అనపర్తికి ఆయా ఎంపీడీఓ కార్యాలయాలు, నిడదవోలుకు అక్కడి గ్రామ కచేరీ, గోపాలపురానికి అక్కడి తహసీల్దార్ కార్యాలయాల్లో అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉంటుంది.



'మేమంతా సిద్ధం' సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న తలశిల రఘురామ్, ఎమ్మెల్యే కన్నబాబు

'మేమంతా సిద్ధం' సభకు చురుగ్గా ఏర్పాట్లు

- పరిశీలించిన తలశిల రఘురామ్
- 19న అచ్చంపేట జంక్షన్ వద్ద సీఎం జగన్ సభ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ రూరల్‌లో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రచార సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాకినాడ రూరల్ తిమ్మాపురం పరిధిలోని అచ్చంపేట జంక్షన్ వద్ద ఖాళీ స్థలంలో సీఎం జగన్ పాల్గొనే మేమంతా సిద్ధం సభ శుక్రవారం జరగనుంది. సభా ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు మంగళవారం పరిశీలించారు. సభా వేదిక, బారికేడ్లు, ర్యాంపు ఏర్పాటు, లక్షలాదిగా హాజరయ్యే ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై రఘురామ్ పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో సీఎం జగన్ పాల్గొనే 'మేమంతా సిద్ధం' సభ కాకినాడ రూరల్ నియోజకవర్గంలోనే జరుగుతోందని, దీనికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వస్తారని, అందుకు తగినట్టు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్, జేఎన్‌టీయూకే ఈసీ మెంబర్ బెజవాడ సత్యనారాయణ, సినీ దర్శకుడు, కన్నబాబు సోదరుడు కల్యాణ్‌కృష్ణ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ రేపు రాక

- కొత్తపేట, రాజమహేంద్రవరం రూరల్, సిటీల్లో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- అనంతరం కాకినాడ పయనం
- వెల్లడించిన మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ/కొత్తపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర గురువారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరగనుంది. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సీఎం జగన్ బస్సు యాత్ర మంగళవారం రాత్రికి రావులపాలెం మండలం ఈతకోట చేరుకుని, అక్కడ రాత్రి బస చేయాల్సి ఉంది. బుధవారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా బస్సు యాత్రకు విరామం ఇచ్చారు. ఆయన అక్కడే విశ్రాంతి తీసుకుని, గురువారం బస్సు యాత్ర కొనసాగించాలని తొలుత నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే బస్సు యాత్ర షెడ్యూల్‌లో మార్పు చేయడంతో సీఎం జగన్ మంగళవారం రాత్రి తణుకు సమీపంలోని తేతలిలో బస చేస్తారు. అనంతరం గురువారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వస్తారు. ఈ వివరాలను కొత్తపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి రావులపాలెంలో తెలిపారు. బస్సు యాత్ర షెడ్యూల్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌లు రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం సంయుక్తంగా విలేకర్ల సమావేశంలో వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించే ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సిద్ధం చేసిన రూట్ మ్యాప్ ప్రకారం.. సీఎం జగన్ కాన్వాయ్ రావులపాలెం, కడియం మీదుగా గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు వేమగిరి చేరుతుందని తెలిపారు. అక్కడ భోజనం విరామం అనంతరం, పార్టీ ముఖ్య నేతలతో జగన్ కొద్దిసేపు మాట్లాడతారు. అనంతరం 3.30 గంటల నుంచి రోడ్డు షో కొనసాగుతుంది. వేమగిరి మీదుగా బొమ్మూరు జంక్షన్, హుకుంపేట జంక్షన్, మోరంపూడి జంక్షన్, ఎంపీ కార్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట జంక్షన్, అశోకా థియేటర్, ఆజాద్ చౌక్, గాంధీ బొమ్మ సెంటర్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, ఆర్యాపురం, అకీరా జంక్షన్, మూలగొయ్యి, సీతంపేట, పేపర్ మిల్లు, మల్లయ్యపేట, గామన్ బ్రిడ్జి మీదుగా దివాన్ చెరువు వరకూ రోడ్ షో సాగుతుంది. అక్కడి నుంచి సీఎం జగన్ కాకినాడ వెళ్తారు. రాజమహేంద్రవరం నగర పరిధిలో మధ్యాహ్నం 4 నుంచి 7 గంటల వరకూ సుమారు మూడు గంటల పాటు రోడ్డు షో కొనసాగుతుంది. ప్రజల అభిమానం, ప్రార్థనలతో రాయి దాడి నుంచి సీఎం జగన్ త్వరగా కోలుకున్నారని, జిల్లాకు రానున్న ఆయనకు అఖండ స్వాగతం పలకాలని, అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి, బస్సు యాత్రను విజయవంతం చేయాలని మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్ ప్రజలకు పిలుపునిచ్చారు. గోదావరి తీరంలో జగన్ రోడ్డు షోకు వచ్చిన ప్రజలను చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని అన్నారు. విలేకర్ల సమావేశంలో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, నందెపు శ్రీనివాస్, వాసంశెట్టి గంగాధర్, కడియాల శ్రీను, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి పాల్గొన్నారు.



ఆర్యవైశ్య కుటుంబాల ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యం

రావులపాలెం: వచ్చే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఆర్యవైశ్యులు అంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవడంతోపాటు వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. రావులపాలెం సీఆర్‌సీ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కొత్తపేట నియోజకవర్గ ఆర్యవైశ్య కుటుంబాల ఆత్మీయ కలయికకు ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును, కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి పాల్గొన్నారు.

వధూవరులుగా సీతారాములు

- రత్నగిరిపై ప్రారంభమైన కల్యాణ వేడుకలు
- శుభం కోరుతూ పసుపు దంచిన ముత్తయిదువలు
- నేడు కల్యాణోత్సవం



సీతారాములను వధూవరులను చేస్తూ పూజలు చేస్తున్న పండితులు



సీతారాముల కల్యాణానికి పసుపు దంచుతున్న ముత్తయిదువలు

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి పెళ్లి పెద్దలుగా విచ్చేయగా రత్నగిరిపై రామాలయంలో సీతారాములను వధూవరులను చేసే కార్యక్రమం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం 4 గంటలకు సీతారాములకు పండితులు ప్రత్యేక పూజలు చేసి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ వధూవరులుగా అలంకరించారు. అనంతరం సీతమ్మ వారికి, రామయ్య తండ్రికి దేవస్థానం అధికారులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం శుభం కోరుతూ ముత్తయిదువలు పసుపు దంచారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, రామాలయం అర్చకులు దేవులపల్లి ప్రసాద్, చిట్టెం వాసు, వ్రత పురోహితులు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి ఇతర పండితులు నిర్వహించారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాన్ని బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఏడు గంటలకు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై, పెళ్లి పెద్దలైన సత్యదేవుడు, అమ్మవారిని పల్లకిపై గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం రత్నగిరి రామాలయం వద్ద వార్షిక కల్యాణ వేదికపై ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ ముహూర్తంలో మాంగల్యధారణ కార్యక్రమం జరుగుతుంది. అనంతరం భక్తులకు ప్రసాదం, పానకం పంపిణీ చేస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు రత్నగిరిపై రోజుకొక వేడుక నిర్వహిస్తారు. ఈ నెల 24వ తేదీ రాత్రి 7 గంటలకు రామాలయంలో జరిగే సీతారాముల శ్రీపుష్పయాగ మహోత్సవంతో శ్రీరామ నవమి ఉత్సవాలు ముగుస్తాయి.

మూడుచోట్ల చూడముచ్చట!

లోక కల్యాణాన్ని అనుగ్రహించే ఆ స్వామివార్లకు పెళ్లికళ వచ్చేసింది! శ్రీరామనవమి వేళ గొల్లలమామిడాడలోని కోదండరామునికి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామికి కల్యాణం నిర్వహిస్తుండగా, శుక్రవారం కోనసీమ తిరుపతిగా ప్రఖ్యాతి గాంచిన వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామికి కల్యాణ క్రతువు సాగనుంది. ఈ కల్యాణ ఘట్టాలను కనులారా వీక్షించడానికి తరలివచ్చే భక్తజనులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు కోదండ రాముని కల్యాణం

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కాకినాడ జిల్లాల్లోని పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రాముడి కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని భద్రాది రాముడి ఆలయానికి దీటుగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో తూర్పు, పశ్చిమ దిశల్లో నిర్మించిన గోపురాలు అత్యంత ఎత్తైనవిగా పేరుగాంచాయి. వాటిపై శిల్పాలను భాగవత, రామాయణాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దారు. గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రామాలయం కల్యాణకాంతులను సంతరించుకుంటోంది. బుధవారం జరిగే సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల సంఖ్యలో హాజరై భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మంచి ముత్యాలను తలంబ్రాలుగా వాడటం విశేషం. కల్యాణ ఉత్సవాలు ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయి.

ఇదీ ఆలయ చరిత్ర

క్రీస్తుశకం 1889లో గొల్లల మామిడాడ గ్రామస్తులు ద్వారంపూడి సుబ్బిరెడ్డి, రామారెడ్డి చిన్న రామాలయాన్ని నిర్మించి అందులో సీతాసమేత శ్రీ రామచంద్రుడి కర్ర బొమ్మ(కోలలు) నిర్మించి ప్రతి రోజు ధూప దీప నైవేద్యాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. కాలక్రమేణా కోలలు స్థానే 1939లో శిల్ప కళా శోభితమైన శ్రీ రామలక్ష్మణ సీతా హనుమాన్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. 1950లో పశ్చిమ గోపురం, 1956లో తూర్పు గోపురాన్ని నిర్మించారు.


ప్రత్యేక అలంకరణలో కొలువైన సీతారాములు

కల్యాణోత్సవ కార్యక్రమాలు వివరాలు

- 18న సుప్రభాత సేవ, నిత్యోపాసన, డోలు సన్నాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 19న సుప్రభాత సేవ, నిత్యోపాసన, సహస్ర నామార్చన, మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్యం
- 20న ఉదయం శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 21న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, కంకణ విసర్జనం, పూర్ణాహూతి, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 22న అద్దాల శయన మందిరంలో రాత్రికి ఊయల సేవ, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

బొండాలు సిద్ధం

జి.మామిడాడ కోదండ రామాలయంలో బుధవారం జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ద్వారంపూడి యువరాజారెడ్డి ప్రత్యేకంగా కొబ్బరి బొండాలను తీర్చిదిద్దారు. శంఖు, చక్ర, నామాలు, రంగురంగుల పాడులు, ముత్యాలు, లేసుల సహాయంతో ఈ బొండాలను అలంకరించారు. 1,00,333 బియ్యం గింజలపై మార్కర్ పెన్నుతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో రామ నామం రాసి తలంబ్రాలు సిద్ధం చేశారు. వీటిని స్వామివారి కల్యాణ క్రతువులో సమర్పించనున్నారు. ప్రస్తుతం ఆయన బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.


సిద్ధం చేసిన కల్యాణ కొబ్బరి బొండాలు

నేటి నుంచి జగన్మోహినీ కేశవస్వామి కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: ముందు పురుష రూపం, వెనుక స్త్రీ రూపంతో ఏకశిలలో శివ విష్ణువులు సాక్షాత్కరించే అద్భుత నిలయం ఆత్రేయపురం మండలంలోని ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయం. స్వయంభూ క్షేత్రంగా ఖ్యాతికెక్కిన ఈ పుణ్యక్షేత్రంలో స్త్రీ, పురుష రూపధారణతో కొలువై వున్న శివ, విష్ణు దేవాతామూర్తులను దర్శించుకుంటే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయ ప్రాంగణంలో ప్రధాన గర్భగుడికి ఇరువైపులా ఏర్పాటైన అమ్మవార్ల విగ్రహాలు ఈ క్షేత్రంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ ఆలయంలో భక్తులందరికి గర్భాలయ ప్రవేశం ఉండటం విశేషం. ఆలయానికి ఎదురుగా పడమర వైపు శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం ఉండటం మరో విశేషం. శివాలయంలో నీరు ఇంకి పోవడం, శ్రీజగన్మోహునుడి ఆలయంలో స్వామి వారి పాదముల నుంచి నిరంతరం గంగ ఉద్భవించడం ఇక్కడి విశిష్టత. రాజమహేంద్రవరం నుంచి ర్యాలి చేరుకునేందుకు గంట సమయం పడుతుంది. రావులపాలెం చేరుకున్న భక్తులు అక్కడి నుంచి ఊబలంక మీదుగా ర్యాలి చేరుకునేందుకు 6 కిలోమీటర్ల ప్రయాణం చేయవలసి వుంటుంది. రావులపాలెం బస్ కాంప్లెక్స్ నుంచి రెండు గంటలకు ఒకసారి ఆర్టీసీ బస్ సౌకర్యం ఉండడంతో పాటు ప్రైవైటు వాహనాల ద్వారా ర్యాలి దివ్య క్షేత్రానికి చేరుకోవచ్చు.

అడుగడుగునా అద్భుతాలే

జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అణువణువునా అద్భుతాలే కనిపిస్తాయి. అత్యంత ఎత్తయిన గోపురం అందరినీ ఆకర్షిస్తుంది. గర్భగుడితో పాటు శ్రీ, భూ విగ్రహాలు సైతం అందరినీ ఆకర్షిస్తాయి. ఆలయ గర్భగుడి ప్రాంగణంలో పూర్వం ఉయోగించారని భావిస్తున్న సారంగ మార్గం చూపరులను ఆకట్టుకుంటుంది. ఇక్కడ ఏక శిలలో స్త్రీ పురుష రూపాల్లో శివ కేశవులు సాక్షాత్కరించడమే కాక ఆ ఒక్క శిలలోనే రెండు విధాలైన ఆలయాలు, పొన్న చెట్టు, దక్షిణ భాగంలో గోవర్ధన పర్వతం, మకర తోరణం స్పష్టంగా కనిపిస్తాయి. ఈ సాల గ్రామ ఏక శిల విగ్రహంలోనే దశావతారాలు కన్పించడం మరో అద్భుతం. విగ్రహం వెనుక వైపు వున్న జగన్మోహినీ రూపం మరింత సమ్మోహనం. స్త్రీ రూపంలో వున్న మహావిష్ణువు అత్యంత సౌందర్యంగా కనిపిస్తారు. శిరమున శిగచుట్టూ అప్పుడే సంపెంగ నూనె రాసుకొన్నట్లున్న శిరోజాలు సహజమైన చీర కట్టు , తలలో ముచ్చటగొలిపే చామంతి పువ్వు విశేషంగా కనిపిస్తాయి. అంతేకాక పద్మినీ జాతి స్త్రీలకు శుభసూచకంగా ఉండేలా పుట్టుమచ్చలు సైతం ఈ విగ్రహంలో సాక్షాత్కరించడం భక్తులను తన్మయత్వంలో ఓలలాడిస్తుంది.


శ్రీకేశవస్వామి వారు

భక్తులకు సౌకర్యాలు



శ్రీజగన్మోహినీ కేశవ స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కల్యాణోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అందుకు తగ్గ సౌకర్యాలు ఏర్పాటు చేశాం. భక్తులంతా స్వామివారని దర్శించుకుని ఆశీస్సులు పొందాలి.

– కృష్ణ చైతన్య, ఆలయ ఈవో

కల్యాణ ఉత్సవ కార్యక్రమాలు

17న ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం గరుడ వాహన సేవ, రాత్రి 8–45 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, 21న సదస్యం, 23న చక్రస్నానం, 24న శ్రీపుష్పోత్సవంతో కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ముగుస్తాయి.


వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

రేపటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం అశేష భక్తజనంతో అలరారుతోంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తజనంతో కిక్కిరిసిపోతోంది. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. గురువారం నుంచి వారం రోజులపాటు స్వామి వారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

స్థల పురాణం

సుమారు 400 సంవత్సరాల క్రితం గౌతమీ నదీ తీరాన వున్న ఓడపల్లి (వాడపల్లి)రుషి పుంగవులతో తపోవనంగా విరాజిల్లేది. ఆ సమయంలో దండకారణ్యంగా పిలిచే ఈ ప్రాంతంలో స్వయంభూవై రక్తచందనం తో శ్రీ వేంకటేశ్వరస్వామి మూర్తీభవించారు. దేవర్షి నారదుడు కూడా వచ్చి అప్పటి నౌకాపురిగా పిలిచే వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. స్వయంభూవై రక్తచందనం రూపంలో గోదావరిలో లభించిన శ్రీవేంకటేశ్వర స్వామివారి విగ్రహాన్ని మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆగమ శాస్త్రం ప్రకారం విగ్రహం లభించిన ప్రాంతంలో ఏటి ఒడ్డున ప్రతిష్ఠించారు.

స్వామివారికి 275 ఎకరాల విరాళం

పినపోతు గజేంద్రుడికి స్నేహితుడు ప్రాంతీయ పరిపాలకుడైన పెద్దాపురం మహారాజు రాజా వత్సవాయి తిమ్మ జగపతి మహరాజు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణకు 1759లో 275 ఎకరాలను విరాళంగా సమకూర్చారు. దీప ధూప నైవేద్యాల కోసం 110 ఎకరాలు, స్వామి వారి సేవల నిమిత్తం 165 ఎకరాల భూమి సమర్పించారు.

చైత్రశుద్ధ ఏకాదశికి స్వామి కల్యాణం

అప్పటి నుంచి ఏటా చైత్రశుద్ధ ఏకాదశినాడు వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి తీర్థం, కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 18న ఆంకురార్పణ, ధ్వజారోహణం, 19న స్వామివారి కల్యాణం, 20న పొన్నవాహనంపై గ్రామోత్సవం, 21న మహదాశ్వీరచనం, సదస్యం, 22న తెప్పోత్సవం, 23న మహా పూర్ణాహుతి, చక్ర స్నానం, 24న స్వామివారి పుష్పోత్సవం తదితర కార్యక్రమాలతో స్వామి కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

ఏర్పాట్లు పూర్తి



స్వామి వారి కల్యాణోత్సవాల్లో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించాం. స్వామివారి కల్యాణానికి భక్తుల సంఖ్య పెరుగుతుంది.

– భూపతిరాజు కిషోర్‌కుమార్, ఆలయ ఈఓ

నేడు అండర్‌-17 చెస్ పోటీలు

అమలాపురం టౌన్: అమలాపురంలోని విద్యానిధి స్కూలులో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి అండర్ –17 బాలుర, బాలికల చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకట సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల ద్వారా ఈ నెల 20న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్‌–17 చెస్ పోటీలకు ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు 2007 సంవత్సరం జనవరి 1వ తేదీ తర్వాత జన్మించినవారై ఉండాలని తెలిపారు. వివరాలకు 98491 75179 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సొంత పార్టీ మహిళపై టీడీపీ నేతల దాడి

రామచంద్రపురం: టీడీపీలోని సొంత పార్టీకే చెందిన ఒక ఆర్యవైశ్య మహిళపై అదే పార్టీకి చెందిన కొంతమంది దాడికి దిగిన ఘటన రామచంద్రపురం పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. దాడికి గురైన టీడీపీ మహిళా కోఆర్డినేటర్, బూత్ ఇన్‌చార్జి ఖండవిల్లి దుర్గాదేవి విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మంగళవారం టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ భార్య సునీత.. స్థానిక నాయకులు, మహిళలతో కలిసి 12వార్డులో ఇంటింటి ప్రచారం చేశారని, బూత్ ఇన్‌చార్జి అయిన తనకు, యూనిట్ ఇన్‌చార్జి అయిన తన భర్తకు సమాచారం ఇవ్వకుండా, మా వార్డులో ప్రచారం చేయటం ఎంతవరకు సమంజసం అని అడిగానని దుర్గాదేవి వివరించారు. నా భర్త పక్కన వున్న వారితో మాట్లాడుతుండగానే అక్కడే వున్న టీడీపీకి చెందిన గడి జగన్ అసభ్యకరంగా మాట్లాడుతూ అక్కడే వున్నా గడి గోవిందు, గోల్డ్ షాప్ మురళిలతో కలసి దాడి చేశారని తెలిపారు. తన రెండు చేతులు వెనక్కి విరిచి పట్టుకోగా గడి జగన్ చెప్పుతో కొట్టి నడిరోడ్డులో అందరిముందు అవమానించినట్టు తెలిపారు. ఇంత జరుగుతున్నా ప్రచారంలో ఉన్న టీడీపీ అభ్యర్థి సుభాష్ భార్య సునీత కానీ, అక్కడ వున్న మహిళా నాయకులు కానీ పట్టించుకోకపోవటం విచారకరమని దుర్గాదేవి అన్నారు. తనపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై సీఐ పి.దొరరాజును వివరణ కోరగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


దాడికి గురైన టీడీపీ మహిళా నేత దుర్గాదేవి

శంఖు చక్ర నామాలతో కల్యాణ బొండాలు

రాములోరి కల్యాణానికి 24 ఏళ్లుగా మండపేట నుంచి అందజేత

మండపేట: భద్రాచలం, ఒంటిమిట్ట రామాలయాల్లో జరిగే సీతారాముల కల్యాణోత్సవాలకు మండపేట నుంచి ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా శంఖ చక్ర నామాలతో రూపొందించిన కల్యాణ బొండాలు తీసుకుని వెళ్లారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన కాజులూరు వెంకట అచ్యుత రామారెడ్డి దంపతులు 24 ఏళ్లుగా శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవాలకు వైష్ణవ సంప్రదాయంలో శంఖ చక్ర నామాలతో వివిధ రకాల రంగులు, చమ్కీలతో కొబ్బరి బొండాలను అందంగా అలంకరిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదేవిధంగా కల్యాణ బొండాలను తీర్చిదిద్దారు. వీటిని భద్రాచలానికి ప్రత్యేక వాహనంలో మంగళవారం సాయంత్రం తీసుకుని వెళ్లారు. అలాగే ఈ నెల 22న ఒంటిమిట్టలో జరిగే రాములోరి కల్యాణానికి కూడా అందంగా అలంకరించిన బొండాలను సమర్పించనున్నట్టు రామారెడ్డి విలేకర్లకు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రసిద్ధి చెందిన కె.గంగవరం మండలం సత్యవాడ, కోనసీమ తిరుమల వాడపల్లి, రామతీర్థంలో జరిగే నవమి వేడుకలకు కూడా కల్యాణ బొండాలను పంపామని చెప్పారు. రాముల వారి కల్యాణంలో ఉడతా భక్తిగా సాయపడటంతో ఏటా తమకు మంచి జరుగుతోందని, ఈతి బాధల్లేకుండా సుఖంగా ఉంటున్నామని రామారెడ్డి చెప్పారు.


కల్యాణ బొండాలకు తుది మెరుగులు దిద్దుతున్న రామారెడ్డి దంపతులు

తిరుమాలిలో షాపు దగ్ధం


తిరుమాలిలో అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న పాన్‌షాపు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో షాపు దగ్ధమైంది. గ్రామానికి చెందిన గేదేల బాబూరావు పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు మంటలు చెలరేగి షాపు దగ్ధం కాగా రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించింది. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

రావులపాలెం: రహస్యంగా కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై మంగళవారం రావులపాలెం పోలీసులు దాడి చేసి 40 మందిని అరెస్టు చేసి, రూ.1,28,400 స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం సీఐ ఎం.ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో పొడగట్లపల్లి గ్రామ శివారు కొబ్బరి తోట వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. డబ్బులు పణంగా పెట్టి కోడిపందేలు నిర్వహిస్తున్న 40 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,28,400 నగదు, 15 మోటార్ సైకిళ్లు, 3 కార్లు, 13 కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

కడియం: మండలంలోని కడియపులంక సచివాలయం–2 గ్రేడ్ 5 కార్యదర్శి ఎండి పర్వీన్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పర్వీన్ ఆ గ్రామ 219 పోలింగ్ బూత్ కు బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్ఒ)గా ఉన్నారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ భరత్ స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు రిపోర్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకు గాను పర్వీన్‌ను సస్పెండ్ చేస్తూ కలక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీరామ పట్టాభిషేక నాణెం


అద్దంకి రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ మనల్ని పాలించే కాలంలో మెజారిటీగా ఉన్న హిందువుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని 1818వ సంవత్సరంలో అంటే ఇప్పటికి 206 సంవత్సరాల క్రితం శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకం దర్బార్ చిత్రాన్ని ఒకవైపు, రెండవ వైపు ఈస్ట్ ఇండియా కంపెనీ, రాజ ముద్రికతో ఒక అణా విలువతో కూడిన నాణేన్ని విడుదల చేసింది. నాలుగు సెంటీమీటర్ల వ్యాసార్థంతో మందంగా ముద్రించారు. చాలా అరుదైన ఈ నాణెం కొందరి వద్దే ఉందని, నాణేల సేకరణలో భాగంగా తమిళనాడులో 20 సంవత్సరాల క్రితం దీన్ని సేకరించినట్లు బొమ్మూరుకు చెందిన సామాజిక వేత్త అద్దంకి రాజా యోనా తెలిపారు.


నాణెంపై శ్రీరామ పట్టాభిషేకం దర్బార్ చిత్రం



ఈస్టిండియా కంపెనీ రాజముద్ర

మద్యం, నగదు సీజ్


అల్లవరం మండలంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై హరీష్‌కుమార్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల వేళ అక్రమ రవాణా అవుతున్న మద్యం, నగదును జిల్లా పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు తనిఖీలు, దాడులతో అడ్డుకుంటున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ బృందాలు జిల్లాలో నిర్వహించిన దాడులు, తనిఖీలు, సీజ్ చేసిన మద్యం, నగదు, అరెస్ట్ అయిన వారి సంఖ్య వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో వివరించింది.

- ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 4 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 1.32 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- మండపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రాజోలు, రామచంద్రపురం, కొత్తపేట ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఎనిమిది కేసలకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసా, 64 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 12.18 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.
- మలికిపురం మండలం దిండి చెక్ పోస్టు వద్ద జరిపిన వాహనాల తనిఖీల్లో రూ.2.50 లక్షల నగదును గుర్తించి సీజ్ చేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీలు మంగళవారం విస్తృతంగా జరిగాయి.
- ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలైన అల్లవరం మండలం కొమరగిరిపట్నం, బెండమూర్లంక, అరగట్లపాలెం, ఓడలరేవు, ద్రాక్షారామ గ్రామంలో ఆయా పోలీసు అధికారులతో కలిపి కేంద్ర బలగాలు మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించాయి. ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా, స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు పోలీసు బందోబస్తు మీకు భరోసాగా ఉంటుంది హామీ ఇచ్చారు.


సమాధి నుంచి వెలికి తీసిన సత్తిబాబు మృతదేహం

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

గుట్టుచప్పుడు కాకుండా సమాధి చేసిన వైనం

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో కోతుల నివారణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి అదే గ్రామానికి చెందిన యర్రా సత్తిబాబు (45) మృతి చెందాడు. విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన వ్యక్తి సమీప ఏటి కాలువలో మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా సమాధి చేయగా పోలీసులు వెలికితీశారు. వివరాలు ఇలా ఉన్నాయి... రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో ఎప్పటలాగె సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన యర్రా సత్తిబాబు కుడుంపాత్రుని చెరువు సమీపంలోని ఏటి కాలువను దాటుకొని గేదెలను మేతకోసం తోలుకెళ్లాడు. సమీప ప్రాంతంలో కొబ్బరితోటలో కొబ్బరికాయలను కోతులు పాడు చేస్తున్నాయని పూడి తాతాజీ అనే తోట యజమాని తన పొలం చుట్టూ కోతుల నివారణ కోసం విద్యుత్ తీగలను అమర్చాడు. యర్రా సత్తిబాబుకు ఆ విద్యుత్ తీగలు తగలడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన తోట యజమాని తాతాజీ సమీప ఏటి కాలువలో సత్తిబాబు మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా సమాధి చేశాడు. పొద్దు పోవడంతో మేతకు వెళ్లిన గేదెలుఇంటికి చేరుకున్నాయి. గేదెలు వచ్చినా సత్తిబాబు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గ్రామస్తులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఎంతకీ సత్తిబాబు ఆచూకీ తెలియకపోవడంతో రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతిపాడు సీఐ శేఖర్ బాబు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. చివరకు తాతాజీని అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.


సత్తిబాబు (ఫైల్)